క్లుప్తంగా

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



వనపర్తి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్న వనపర్తి యూనియన్ బ్యాంక్ మేనేజర్ శేఖర్‌రెడ్డిని సోమవారం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ... వినియోగదారులకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు అధికారుల ప్రశంసలు అందుకుంటారని, ప్రజల హృదయాల్లో ఎప్పటికీ ఉంటారని చెప్పారు. వృత్తిపరంగా పేదలకు ఆర్థికంగా చేయూతనందించడంలో మేనేజర్ శేఖర్‌రెడ్డి పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక సభ్యులు చంద్రశేఖర్, డి. రాములు, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌తో సేవలు మరువలేనివి



పాన్‌గల్: రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం మాందాపూర్‌లో డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ భారతీయ మహిళ లోకానికి భారత రాజ్యాంగం ద్వారా ఓటు, విద్య, ఉద్యోగాల కార్మిక హక్కు కల్పించేందుకు కృషి చేసిన అంబేడ్కర్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో చిత్ర, సింధు, కవిత, అనిత, అనూష, పూజిత, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పాములకు హాని చేయొద్దు



పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లిలో కురువ నాగన్న ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్న రాళ్ల కుప్పలో రెండు పాములను గుర్తించి, జిల్లా సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు ఫోనులో సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న కృష్ణసాగర్ రాళ్ల కుప్పను ప్రొక్లెన్ సహాయంతో తొలగించి రెండు పాములను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములకు హాని చేయొద్దని కోరారు. పాములు కనిపిస్తే తనకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అవినాష్, సత్యనారాయణగౌడ్, రవీందర్,నాగరాజు, భానుచందర్, భరత్ పాల్గొన్నారు.

వర్షంతో ఊరట



అమరచింత: వారం రోజులుగా ఉక్కపోతతో అలమటిస్తున్న ప్రజలకు సోమవారం కురిసిన వర్షం కాస్త ఉపశమయం కలిగించింది. వర్షాకాలం ప్రారంభం నుంచి కూడా సరైన వర్షాలు లేక మెట్ట పంటలు నీరు లేక వాడుముఖం పడుతుండటంతో సోమవారం కురిసిన వాన పంటపొలాలకు ఊపిరి పోసినట్టుగా ఉందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. చిత్త ఎండలతో అలమటించిన ప్రజలకు వర్షం రాకతో వాతవరణం ఒక్కసారిగా చల్లబడింది.

ముమ్మరంగా హైవే పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి సోమశిల వరకు జాతీయ రహదారి–157కె పనులు పెద్దకొత్తపల్లి మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కల్వకోలు, చెన్నపురావుపల్లిలో సైడ్ కాల్వల పనులు చేస్తున్నారు. దీంతో పాటు కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి.

బీచుపల్లిలో హనుమాన్ చాలీసా పారాయణం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు ఆకుపూజ, అభిషేకం చేశారు. వికాస తరంగిని ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆలయంలో 41సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.

అభివృద్ధికి ఆమడదూరం



శిథిలావస్థకు చేరిన అయ్యవారిపల్లి గ్రామపంచాయతీ భవనం

- అయ్యవారిపల్లిలో కనీస వసతులు కరువు
- ఊసే లేని డ్రెయినేజీలు

చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లి అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. గ్రామంలో సుమారు 1,700 పైచిలుకు జనాభా ఉన్నా.. కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణానదికి ఒడ్డున తెలంగాణ రాష్ట్రానికి చిట్టచిరి ప్రాంతంగా నిలిచి ఉన్న గ్రామంపై పాలకులు చిన్న చూపు చూస్తున్నారు.

వరదల్లో సర్వస్వం కోల్పోయి..

అప్పుడప్పుడే గ్రామం అభివృద్ధికి నోచుకుంటున్న దశలో 2009లో వచ్చిన కృష్ణానది వరదలకు గ్రామ రూపురేఖలు మారాయి. గ్రామానికి చెందిన దాదాపు 200 కుటుంబాలు చిన్నంబావి మండల కేంద్రంలో పునరావాసంలో తలదాచుకున్నారు. కాలక్రమేణా వారందరూ గ్రామాన్ని వదిలి చిన్నంబావిలో స్థిరపడ్డారు. అయితే చాలామంది గ్రామాన్ని వదలలేక అక్కడే ఉండిపోవడంతో వారికి వసతులు కరువయ్యాయి.



అయ్యవారిపల్లి వ్యూ

పక్కా భవనాలేవి?

గ్రామానికి తలమానికంగా ఉండాల్సిన గ్రామ పంచాయతీకి పక్కాభవనం లేక పాలక మండలి సభ్యులు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి దూరంగా శ్రీశైలం ప్రాజెక్టు ముంపులో కోల్పోయిన భవనంలోనే ఇంకా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారంటే అభివృద్ధి ఏమాత్రం ఉందనే విషయం అర్థమవుతుంది. గ్రామంలో అంతర్గత సీసీ రహదారులు లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు రోడ్లపై నడుస్తున్నామా.. బురదలో వెళ్తున్నామా అని తెలియట్లేదని ప్రజలు వాపోతున్నారు. ఇంకా డ్రెయినేజీల ఊసే లేదు. గ్రామానికి వేళకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి 10 కి.మీ దూరం ఉన్న గ్రామానికి రాత్రి వేళలో నడిచి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయండి



తరతరాలుగా గ్రామం అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతుంది. వరదలకు ముందు గ్రామ జనాభా 2,500పైగా ఉండేది. మాకు పునరావస కేంద్రం ఏర్పాటు చేసినా.. గ్రామాన్ని వదిలి వెళ్లలేక ఇక్కడే కాలం వెళ్లదీస్తున్నం. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పరచాలి.

– శేఖర్, అయ్యవారిపల్లి

తప్పని తిప్పలు



గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లపైనే నీరు చేరుతుంది. అదేవిధంగా గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు లేక బురదమయంగా మారుతున్నాయి.

– కృష్ణ, అయ్యవారిపల్లి

బోధన అంతంతే..

గ్రామంలో మొత్తం 130మంది విద్యార్థులు ఉన్నా.. ఒకే ఒక్క టీచర్‌తో బోధన కొనసాగిస్తున్నారు. విద్యపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గొప్పలు చెబుతున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో అది కనిపించడం లేదు. తమ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని నెల రోజుల కిందట చిన్నంబావి మండల కేంద్రంలో విద్యార్థులు గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. దీంతో నలుగురు టీచర్లను అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. కానీ ఇంకా ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనం లేక చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, రైతుబంధు కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు నిబంధనలు విధించి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరినీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ కాక గ్రామాల్లో చాలా మందికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేఎల్ఐ కాల్వల ద్వారా చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, నాగేష్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, సుధాకర్ నాయక్, నరసింహ, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కొల్లాపూర్: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల కారణంగా మంగళవారం కరెంట్ కోతలు ఉంటాయని విద్యుత్‌శాఖ ఏఈ రాకేష్‌రెడ్డి వెల్లడించారు. 11 కేవీ టౌన్ బ్రేకర్ రీప్లేస్‌మెంట్ చేయడం కోసం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు రామాపురం, సోమశిల, చుక్కాయిపల్లి, ఎల్లూరులో కరెంట్ కోతలు ఉంటాయని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలోని గోప్లాపూర్ చెందిన కళావతమ్మకు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోపాల్ చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, ప్రభాకర్, ఆంజనేయులు, కుర్మయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీలో మురుగు తొలగించాలి



చిన్నచింతకుంట: నెల్లికొండిలోని 6వ వార్డులో డ్రెయినేజీలు మురుగు, పిచ్చి మొక్కలు, కంపచెట్లతో అలుముకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ కాలం మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద పెరిగిపోయిందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే డ్రెయినేజీలను శుభ్రపరిచాలని కోరుతున్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి చెందిన బగ్గి శ్రీనివాసులు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అదేవిధంగా అడ్డాకుల మండలం గుడిబండకి చెందిన సూరన్నకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.లక్ష మంజూరు కాగా సంబంధిత చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాది సంతోష్‌పై పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపు మేరకు బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. న్యాయవాదులు విధులకు హాజరు కాకూడదని తీర్మానించినట్లు తెలిపారు. తీర్మానం కాపీని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవితకు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణ రెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, ఆంజనేయులు, యాకోబు, నాగరాజు యాదవ్, యుదుర్ బాష ఉన్నారు.

అనుబంధాల 'రాఖీ'



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి



అమరచింతలో..

సోదరులు, సోదరిమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారిపై తమకున్న ప్రేమను, ఆప్యాయతను తెలిపారు. ఈ సందర్భంగా ఒకరికొకరం బాసటగా ఉంటామని భరోసానిచ్చుకున్నారు. ఆడపడుచుల రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

– సాక్షి, నెట్‌వర్క్



పాన్‌గల్‌లో..



వనపర్తిలో..



ఏదులలో..



వీపనగండ్లలో..



దుప్పల్లిలో..



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో..

చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



వెంకటగిరి ఆలయంలో శ్రీభూలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



సూగూరులో..

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు చౌడేశ్వరి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా తొగుట వీర సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారిని కృష్ణానది నీటితో అభిషేకించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి నైవేద్యం అందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, నైవేద్యం వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు సితార వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, శేఖర్, సలేశ్వర్, మహేష్, లక్ష్మీపతి, అలివేల తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల వెంకటగిరి గుట్టపై వెలసిన భూలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రావణ నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణక్రతువు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అర్చకులు తలంబ్రాలు, ఆడపడుచులు వడిబియ్యం పోశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టూ ఊరేగింపు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులు, కిట్టు స్వామి, అమిత్, ఆలయ నిర్వాహకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, వెంకటేష్, శ్రీనివాసులు శెట్టి, తిరుపతిరెడ్డి, రాజేష్, వినయ్‌కుమార్, మోహన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా దంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ వారు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి



అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్‌కు రాఖీలు కడుతున్న వైద్యకార్మికులు

ఆత్మకూర్: వైద్యులు, వైద్య సిబ్బందికి పూర్తిగా రక్షణ కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వైద్య కార్మికులు అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వైద్యకార్మికులు అడిషనల్ ఎస్పీకి, సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌కు రాఖీలు కట్టారు. ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్ల ప్రాణాలు తీసేందుకు కొంతమంది తెగబడుతున్నారని, కలకత్తాలో డాక్టర్‌పై జరిగిన ఘటన యావత్తు దేశానికే మాయనిమచ్చ అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బందిపై ఇలాంటి దాడులు భవిష్యత్‌లో పునారవృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుల పెండింగ్ వేతనాలను ఇప్పించాలని కోరారు. నాయకులు సత్తార్, మైనొద్దీన్, పార్వతమ్మ, చెన్నమ్మ, మణెమ్మ, బాలకిష్టమ్మ, శైలజ తదితరులు ఉన్నారు.

ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు



ప్రభకు పూజలు చేస్తున్న పద్మశాలీలు

అమరచింత: నూలు పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని పద్మశాలీలు భక్త మార్కండేయ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం ప్రభోత్సవం కనులపండువగా చేశారు. ఆలయం నుంచి ప్రభను పట్టణ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో భజన గీతాలను ఆలపిస్తూ ఊరేగించారు. ఈసందర్భంగా పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న మాట్లాడుతూ రాఖీపౌర్ణమి రోజే నూలు పౌర్ణమిని నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని వెల్లడించారు. ఈరోజునే నూలు పోగు పుట్టిందని, దీంతో పండుగను సంతోషంగా జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో మహంకాళి ప్రభాకర్, మహంకాళి విష్ణు, తాటికొండ రమేష్, ఎల్ల బాలస్వామి, చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్లలో..



ఆత్మకూర్‌లో డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఫొటోగ్రాఫర్లు చాలీచాలని డబ్బులతో కాలాన్ని వెల్లదీస్తున్నారని ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు ఆంజనేయులుయాదవ్, వెంకటేశ్వర్లగౌడ్, ఈశ్వర్, వెంకట్‌రావు, శివ, అభి అన్నారు. సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

అమరచింత: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈమేరకు ఫొటోగ్రఫీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ చాలామంది ఫొటోగ్రాఫర్లు వృత్తిపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను చేతి వృత్తులుగా గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో కొట్టం ప్రతాప్‌రెడ్డి, మహేందర్, విజయ్, క్రాంతి, శ్రీధర్, రవి, శ్రావణ్,జగన్, కవిరాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో ఫొటోగ్రాఫర్లు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో ఫొటోగ్రాఫర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, శ్రీను, సలాం, యాదయ్యసాగర్, బాలరాజు, రాములు, అల్లావుద్దీన్, రమేష్, రవి, ఉస్మాన్, రామస్వామి, రాసమోని గోవర్ధన్, రాజుఉన్నారు.

ఆత్మకూర్: స్థానిక గాంధీచౌక్‌లో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటం ఏర్పాటు చేసి ఫొటోగ్రాఫర్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీరాములు, శ్రీనివాసులు, మన్యం, నవీన శ్రీను, తౌఫీక్, ప్రేమ్, ప్రసాద్, రాజశేఖర్, నరేష్, వెంకట్రాములు, అంజి, తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.